

పట్టణంలో శోభాయాత్ర ఏర్పాట్లను పరిశీలిస్తున్న పాయల శంకర్

నవమి ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 16: ఐదు వందల ఏళ్ల కల అయోధ్య రామ మందిర నిర్మాణాన్ని ప్రధానమంత్రి నేరవేర్చారని, తొలిసారి అయోధ్యలో జరిగే రామనవమి వేడుకల్లో భాగంగా పట్టణంలో భారీ శోభయాత్రను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పాయల శంకర్ తెలిపారు. శ్రీరామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారీ శోభాయాత్ర ఏర్పాట్లను మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. స్థానిక గోపాలకృష్ణ మఠం వద్ద భారీ రాముడి విగ్రహ తయారీతో పాటు శోభాయాత్ర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శోభాయాత్రలో భక్తులకు, పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని పోలీసు శాఖను కోరారు. ఈ యాత్రలో పాల్గొనేందుకు వస్తున్న భక్తుల కోసం తాగునీరు, ప్రసాదం వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. 500 ఏళ్ల హిందువుల కల నరేంద్ర మోదీ వల్ల సహకారం అయ్యిందని, శ్రీరామనవమి పండుగను హిందువులు భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారని అన్నారు. ఇందులో జిల్లా నాయకులు శ్రీరామ ఉత్సవ సమితి నాయకులు రాళ్లబండి మహేందర్, కె.సాయి, మహేందర్, జోగురవి, ఆకుల ప్రవీణ్, సురేందర్, అర్జున్, నాగేందర్‌గౌడ్, నిఖిల్, శివగౌడ్, గోపి, సచిన్, తదితరులు ఉన్నారు.

సీతారామ కల్యాణోత్సవానికి ముస్తాబైన శ్రీరామ ఆలయాలు

జైనథ్ రూరల్, ఏప్రిల్ 16: మండలంలోని పిప్పర్‌వాడ, దీపాయిగూడ, లక్ష్మీపూర్, సాత్నాల, ఆనంద్‌పూర్‌లతో పాటు బోరజ్ గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి రామాలయాలు ముస్తాబు అయ్యాయి. ఈ సందర్భంగా ఆ గ్రామాల్లో గల రామాలయాలను రంగురంగుల విద్యుత్‌దీపాలు, రంగురంగుల పూలతోరణాలతో అలంకరించారు. బుధవారం జరిగే సీతారాముల కల్యాణోత్సవాలకు సంబంధించి బోరజ్, పిప్పర్‌వాడ గ్రామాల్లో భారీ ఎత్తున ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సీతారాములు, లక్ష్మణుడు, హనుమంతుని విగ్రహాలకు పట్టువస్త్రాలు బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించాయి. బోరజ్, పిప్పర్‌వాడ, ఆనంద్‌పూర్ గ్రామాల్లో జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి మహిళలు భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని అయా గ్రామాల నిర్వాహకులు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



బోరజ్‌లో విద్యుత్ బల్బులతో అలంకరించిన రామాలయం




కమలంలో.. అసమ్మతి!

- జిల్లాలో బీజేపీని వీడుతున్న పలువురు పార్టీ ముఖ్యనేతలు
- కాంగ్రెస్‌తో చేతులు కలిపిన బోథ్ మాజీ ఎమ్మెల్యే బాపురావు
- మళ్లీ సొంతగూటికి చేరిన జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్
- కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్న మరికొంత మంది నేతలు
- చర్చనీయాంశంగా మారిన కమలం పార్టీ వలసలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లు కమలం పార్టీలో కొనసాగిన ముఖ్యనేతలు ఆ పార్టీని వీడి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలలో చేరడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పలువురు నేతలు కమలం పార్టీతో తెగతెంపులు చేసుకుంటున్నారు. సిట్టింగ్ స్థానాన్ని మళ్లీ తన ఖాతాలో వేసుకునేందుకు బీజేపీ ఆరాట పడుతోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు దానికి భిన్నంగా కనిపిస్తున్నాయి. ఈసారి సిట్టింగ్ ఎంపీని పక్కన పెట్టి కొత్త అభ్యర్థికి అవకాశం ఇవ్వడంతో పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల బోథ్ నియోజకవర్గంలో పార్టీ ముఖ్య నేతల తీరుకు నిరసనగా గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, బోథ్ మండలాలకు చెందిన పలువురు నేతలు బీజేపీని వీడుతున్నట్లు బహిరంగ ప్రకటన చేయడం పార్టీలో కలకలం రేపింది. తాజాగా బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్‌లు పార్టీని వీడడం చర్చనీయాంశంగా మారింది. వీరి బాటలోనే మరికొంతమంది పార్టీని వీడే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ అభ్యర్థిని ప్రకటించినప్పటి నుంచి బీజేపీలో అసమ్మతి సెగ రగులుతోంది. ఇప్పటికి కొంతమంది ముఖ్యనేతలు పార్టీ ప్రచారానికి అంటీముట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది కమలం పార్టీ నుంచి వలసలు పెరగడం ఆ పార్టీ నేతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుందన్న టాక్ వినిపిస్తోంది.

పార్టీ అభ్యర్థికి మద్దతునిచ్చే ఇష్టం లేక..

గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ ఆశించినా.. దక్కక పోవడంతో ఆ పార్టీని వీడి బీజేపీ పార్టీలో చేరిన బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మళ్లీ కొన్నాళ్లకే అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే తనకు రాజకీయ భవిష్యత్తును లేకుండా చేసిన మాజీ ఎంపీ గోడం నగేష్‌కు లోక్‌సభ ఎన్నికల్లో మద్దతునిచ్చేందుకు ఇష్టం లేక రాథోడ్ బాపురావు బీజేపీని వీడినట్లు తెలుస్తుంది. గత ప్రభుత్వ హయాంలో ఈ ఇద్దరు నేతలు బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగారు. అప్పట్లో వీరిద్దరి మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు ఉండేవి. అనుకోకుండా మళ్లీ వీరిద్దరూ ఒకే పార్టీలో చేరిపోవడంతో విభేదాలకు దారి తీసింది. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌కు మద్దతు ఇచ్చేదే లేదంటూ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు గత కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇప్పటికే బోథ్ నియోజకవర్గంలో ఆయన అనుచరులను కాంగ్రెస్ పార్టీలోకి పంపి ఆ తర్వాత రాథోడ్ బాపురావు కాంగ్రెస్‌లో చేరిపోయారు. కేవలం ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌పై ఉన్న వ్యతిరేకతతోనే రాథోడ్ బాపురావు పార్టీని వీడారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.



అటు ఇటు తిరిగి మళ్లీ బీఆర్ఎస్‌లోకే..

జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ మళ్లీ సొంతగూటికే చేరుకున్నారు. మంగళవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ కండువా వేసుకున్నారు. ఉద్యమ సమయంలో కీలకంగా పని చేసిన ప్రభుత్వ ఉద్యోగి అయిన జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్‌కు బీఆర్ఎస్ పార్టీ జడ్పీ చైర్మన్‌గా అవకాశం కల్పించింది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నాలు చేసినా దక్కలేదు. దీంతో ఆయన తీవ్ర అసంతృప్తికి గురై కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. కొంత మంది జిల్లా నేతలతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు నిర్ణయించుకున్నారు. కానీ పరిస్థితులు అనుకూలించక పోవడంతో





కాంగ్రెస్ పార్టీలో చేరలేదు. ఆ తర్వాత అనుకోకుండా గత కొంతకాలం క్రితమే బీజేపీలో చేరిపోయారు. అయితే ఆ పార్టీ నేతలతో విభేదాలు రావడంతో కొన్నాళ్లుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగానే ఉంటూ వస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మళ్లీ బీఆర్ఎస్ నేతలు సంప్రదింపులు జరుపడంతో ఆ పార్టీలో చేరిపోయారు. అటు ఇటు తిరిగి చివరకు జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ మళ్లీ బీఆర్ఎస్ పార్టీలోనే చేరిపోయారన్న టాక్ వినిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికల వరకైనా జడ్పీ చైర్మన్ బీఆర్ఎస్‌లో కొనసాగుతారా? లేదా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

కాంగ్రెస్ వైపు బీజేపీ నేతలు

బీజేపీలో కొంత మంది నేతలు ఒంటెద్దు పోకడలతో వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో కొందరు బీజేపీ నేతలు పార్టీలో ఉండలేక కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే పలువురు నేతలు రెబల్స్‌గా ఎన్నికల బరిలో దిగేందుకు సిద్ధమవుతుండగా.. మరికొంత మంది పార్టీని వీడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు పూర్తిగా పార్టీ కార్యక్రమాలకు, ప్రచారానికి దూరంగానే ఉంటున్నారు. ఆయన కూడా రెబల్స్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరికొంత మంది ఆయన బాటలోనే ఉన్నట్లు కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌తో విభేదాలు తలెత్తడంతో బీజేపీ సీనియర్ నేత లోక ప్రవీణ్‌రెడ్డి అసంతృప్తితోనే కనిపిస్తున్నారు. ఇటీవల నేరడిగొండ మండలానికి చెందిన 500 మంది కార్యకర్తలు బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. లోక ప్రవీణ్‌రెడ్డితో పాటు పలువురు ఎంపీటీసీ, సర్పంచ్‌లు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. త్వరలోనే వీరంతా కాంగ్రెస్ పార్టీలో చేరిపోతారన్న ప్రచారం జరుగుతుంది. అయితే వరుసగా జరుగుతున్న వలసలతో కమలం పార్టీ ఉక్కిరిబిక్కిరవుతోంది. వలసలకు అడ్డుకట్ట వేసేందుకు ఆ పార్టీ అగ్రనేతలు ప్రయత్నాలు చేస్తున్నా.. ప్రయోజనం కనిపించడం లేదు.

సంక్షిప్త సమాచారం



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో

అమ్మ ఆదర్శ పాఠశాల పరిశీలన

ఇచ్చోడ, ఏప్రిల్ 16: అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎన్నికైన అడేగామ(కె) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఎంపీడీవో లక్ష్మణ్ పరిశీలించారు. శిథిలమైన, మౌలిక వసతులు లేని బడులకు కావాల్సిన నిధుల మంజూరుకు ప్రతిపాదనలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటశాల, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించి పలు సూచనలను చేశారు. ఆయన వెంట పాఠశాల సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నేరడిగొండ, ఏప్రిల్ 16: మండలంలోని చించోలి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఆత్రం భాస్కర్ తమ్ముడు ఆత్రం 'పీందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అలాగే నేరడిగొండ మండలం గాంధారి గ్రామంలో ఆత్రం జైవంత్‌రావు తనయుడు ఆత్రం మహేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేసి నివాళులర్పించారు. బాధితకుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట పార్టీ మండల అధ్యక్షుడు వసంత్‌రావు, ఇచ్చోడ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, మైముత్‌ఖాన్, ముస్తఫా, ఇచ్చోడ వైస్ ఎంపీపీ జలైజాకు, రషీదు, తదితరులున్నారు.

రామున్ని మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం

- సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలోకి జంప్ కావడం ఖాయం
- మంత్రి పదవులు అనుభవించిన వారే జారుకుంటున్నారు
- మన భవిష్యత్తును నిర్ణయించేవి ఈ లోక్‌సభ ఎన్నికలే..
- బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి కేటీఆర్

ఆదిలాబాద్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాముడికి పార్టీలతో సంబంధం లేదని రాముడిని మొక్కుదాం.. బీజేపీని తొక్కుదామంటూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే గెలిచిన ఎంపీలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ పార్టీలోకి జంప్ అవడం ఖాయమంటూ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం పోగానే మంత్రి పదవి, పెద్ద పెద్ద పదవులు అనుభవించిన వారంతా పార్టీ నుంచి జారుకుంటున్నారని అన్నారు. అధికారంలో ఉండగా కేసీఆర్ చంద్రుడు, ఇంద్రుడు, దేవుడు అన్న వారే.. ఇప్పుడు పార్టీలో కనిపించడం లేదన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజలు ఏమనుకుంటున్నారో అందరికీ తెలుసునన్నారు. అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. బస్సు ఫ్రీ, బంగారం ఫ్రీ, రైతుబంధు, ఆసరా పింఛన్లను పెంచుతామని.. సాధ్యం కాని హామీలనిచ్చి వంద రోజులు గడిచినా.. హామీలు నెరవేర్చలేదన్నారు. డిసెంబరు 9న అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీపై సంతకం చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. మళ్లీ కొత్త కథ చెబుతున్నారని, పంద్రాగస్టు వరకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తాననడం మోసం చేయడమే అన్నారు. ఓడలో ఉన్నప్పుడు ఓడ మల్లన్న ఒడ్డుకెక్కిన తర్వాత బోడ మల్లన్న అన్నట్లుగా రేవంత్‌రెడ్డి తీరు ఉందన్నారు. ఎన్నికల ముందు రైతులు కర్రు కాల్చి వాత పెడతారనే భయంతో కాంగ్రెస్ మళ్లీ రుణమాఫీ చేస్తామని చెబుతుందన్నారు. రుణమాఫీ కావాలంటే గులాబీ జెండాకు ఓటు వేయాలన్నారు. అధికారంలోకి రాగానే రూ.10వేల రైతుబంధును రూ.15వేలు ఇస్తామని చెప్పిన ఇప్పటికీ దిక్కులేదన్నారు. రైతుబంధు ఏమైందని ప్రశ్నిస్తే ఓ మంత్రి వెంకట్‌రెడ్డి చెప్పుతో కొడతా అంటాడు. గత ప్రభుత్వ హయాంలో రూ.75వేల కోట్ల రూపాయలు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో వేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మే 13న రైతులు చెప్పు తీసుకొని కాంగ్రెస్‌ను కొట్టే పరిస్థితి వచ్చిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సమయానికి ఎరువులు, కరెంట్, మంచినీళ్లు వచ్చేవని.. కాంగ్రెస్ ప్రభుత్వంతో కరువు వచ్చిందన్నారు. ఏజెన్సీలో విషజ్వరాలు, రోగాలు, అంటువ్యాధులు, అతిసారా ఉండేవని.. 'మిషన్ భగీరథ'తో కష్టాలు దూరమయ్యాయన్నారు. ఈ ఎన్నికలు మన రాజకీయ భవిష్యత్తును నిర్ణయిస్తాయని.. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌ల పై ప్రజలు ఎంతో కోపంగా ఉన్నారని అన్నారు.

కాంగ్రెస్‌ను నిలదీయండి..

ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 32వేల ఉద్యోగాలు కూడా కేసీఆర్ ప్రభుత్వమే ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదన్నారు. మందికి పుట్టిన బిడ్డను మన బిడ్డగా చెప్పుకోవడం కాంగ్రెస్‌కు అలవాటై పోయిందన్నారు. గెలిచిన యేడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ నేతలను నిలదీయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆగస్టులో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు వస్తాయన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్‌లో పక్కాగా గెలుపు అవకాశాలు తమకే ఉన్నాయన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజలకు వివరించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో టెట్ నోటిఫికేషన్ ఇచ్చి పరీక్ష ఫీజుగా రూ.400లు నిర్ణయిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రూ.2వేలను గుంజుతుందన్నారు. ఆనాడు 5వేల ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే రేవంత్‌రెడ్డి విమర్శించారని, ప్రస్తుతం 10వేల ఉద్యోగాలు ఇచ్చి మెగా డీఎస్సీ అని చెప్పుకుంటూ నిరుద్యోగులను మోసం, దగా చేశారన్నారు. అలాగే 500లతో గ్రూప్-1 ఉద్యోగాల నోటిఫికేషన్ ఇస్తే.. కాంగ్రెస్ 560 ఉద్యోగాలతో కొత్త నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఉద్యోగులు, ఉపాధ్యాయులపై శత్రుత్వం లేదు

దేశంలోనే ఉద్యోగులకు అత్యధిక వేతనాలు ఇచ్చిన రాష్ట్రం తెలంగాణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం కంటే ఎక్కువ వేతనాలను ఇవ్వడం జరిగిందన్నారు. కరోనా పరిస్థితుల నేపథ్యంలో సంక్షేమ పథకాలను ఆపకుండా.. ఉద్యోగుల వేతనాల చెల్లింపుల్లో కొంత ఆలస్యమైన మాట వాస్తవమేనన్నారు. అంతేకాని ఉద్యోగులు, ఉపాధ్యాయులతో ఎలాంటి శత్రుత్వం లేదన్నారు. 73 శాతం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వేతనాలు పెంచి ఇవ్వడం జరిగిందన్నారు. ఉద్యోగులతో ఉన్నది పేగుబంధమన్నారు. 6నుంచి 10 శాతానికి రిజర్వేషన్లను పెంచి తండాలు, గూడాలను పంచాయతీలుగా మార్చుకున్నామన్నారు. పోడు భూములకు పట్టాలు ఇచ్చామని, జల్ జంగల్ జమీన్ అనే నినాదాన్ని ఆచరణ సాధ్యం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వాలు కొమురంభీంను పట్టించుకోలేదని, తెలంగాణ వచ్చిన తర్వాత భీంకు అసలైన గౌరవం దక్కిందన్నారు. కొత్తగా ఆసిఫాబాద్ జిల్లాను ఏర్పాటు చేసి ఆ జిల్లాకు కొమురంభీం పేరును పెట్టామన్నారు. ఆనాడు ఇంద్రవెల్లిలో రైతులను కాల్చి చంపిందే కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అలాంటిది అమరవీరుల కుటుంబాలకు క్షమాపణలు చెప్పకుండా ఇంద్రవెల్లికి కాంగ్రెస్ నేతలు రావడం సిగ్గు చేటన్నారు. అధికారం శాశ్వతం కాదని.. పోయింది అధికారం మాత్రమే కార్యకర్తల్లో పోరాట పటిమ తగ్గలేదన్నారు.



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

కాంగ్రెస్‌ను కూలగొట్టే కర్మ మాకులేదు

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టే కర్మ మాకులేదన్నారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేసేంత వరకు కాంగ్రెస్ పార్టీని వదిలి పెట్టేదే లేదన్నారు. పార్టీ నుంచి పోయిన వారంతా ఉద్యమంలో పని చేసిన వారు కాదని, అసలు ఉద్యమం చేసిన వారే ఇప్పుడు పార్టీలో మిగిలి పోయారన్నారు. మొన్న జరిగిన ఎన్నికల్లో బీజేపీ ముఖ్యనేతలను బీఆర్ఎస్ అభ్యర్థులు ఓడించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. బీజేపీకి మెజార్టీ వస్తే రాజ్యాంగాన్ని మార్చడంతో పాటు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు లేకుండా మాయం చేసే అవకాశం ఉందన్నారు. 2026లో దేశవ్యాప్తంగా నియోజక వర్గాల పునర్విభజన జరుగనుందని, దక్షిణాది రాష్ట్రాలలో కుటుంబ నియంత్రణ పాటించాలని చెప్పి.. ఉత్తరాది రాష్ట్రాలలో జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచుతామని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. తెలంగాణలో పార్లమెంట్ సీట్లను తగ్గిస్తే కొట్లాడేది బీఆర్ఎస్ పార్టీనని పేర్కొన్నారు. ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే కేంద్ర, రాష్ట్రా ప్రభుత్వాల మెడలను వంచుతామన్నారు. ఇందులో మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, నిర్మల్ జడ్పీ చైర్మన్ కొరిపెల్లి విజయలక్ష్మి, మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, రమాదేవి, జాన్సన్‌నాయక్, బాల్క సుమన్, జడ్పీ చైర్మన్ రాథోడ్‌జనార్ధన్, తదితరులున్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు : కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 16: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రాబోయే రోజుల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజార్షిషా తాగునీటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రానీయకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఎండలు రోజురోజుకి ఎక్కువవుతుండడం వల్ల రాబోయే రోజుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తాగునీటి సరఫరా ప్రక్రియలో అంతరాయం కలుగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. తాగునీటిపై వచ్చే సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు. సమస్యలు ఎక్కువగా ఉన్న హాబిటేషన్‌ల పై ప్రత్యేక అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఇప్పటికే ఎస్‌డీఎఫ్, ఓఎన్‌డీఎంలో నిధులు మంజూరు చేయడం జరిగిందని, ఇప్పటి వరకు ఎన్ని పనులు ప్రారంభించారు. ఎన్ని పనులు పూర్తి చేశారు. వాటి వివరాలు హాబిటేషన్‌ల వారీగా సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి రానున్న రోజుల్లో గ్రామాల్లో పట్టణాల్లో నీటిఎద్దడి నివారణకు చర్యలు చేపట్టి నీటి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీపై సమీక్ష నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పాఠశాలలో మౌళిక వసతుల కల్పన పనులు కమిటీ తీర్మానంతో జూన్ 10లోగా పూర్తి చేయాలని, మౌళిక వసతులు అవసరమైన పాఠశాలల్లో ప్రారంభంకాని పనులు వెంటనే ప్రారంభంచాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సౌకర్యం,తరగతి గదుల మేజర్, మైనర్ మరమ్మతులు, టాయిలెట్ మరమ్మతులు, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణ పనులు, విద్యుత్ సౌకర్యం, పెయింటింగ్ వంటి మౌళిక వసతుల పర్యవేక్షణ పనులు పాఠశాలలు పునర్ ప్రారంభమయ్యేలోపు పూర్తి చేయాలని అన్నారు. పనులు జరిగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పాఠశాలలో మౌళిక వసతులపనులు అమ్మ ఆదర్శ కమిటీ ద్వారానే పూర్తి చేయాలన్నారు. ఏప పాఠశాలలో ఏఏపనులు చేపట్టాలో సంబంధిత అధికారులను మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పనుల గురించి కార్యాచరణ రూపొందించుకోవాలని, జిల్లా మండల పరిషత్, ఇంజనీరింగ్ అధికారులు, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరులు, మండల విద్యాశాఖాధికారులు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్, గ్రిడ్, డీటీడబ్ల్యువో, డీపీవో, డీఈవో, డీఎల్‌పీవో, ఎంపీడీవోలు, ఏఈవో, ఎంపీవో, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో పాల్గొన్న అధికారులు (పక్కన మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా)

ప్రతీఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి : కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్: ఓటరుగా నమోదు చేసుకున్న ప్రతీఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ రాజార్షిషా సూచించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జడ్పీ సమావేశంలో సీనియర్ సిటీజన్, ట్రాన్స్‌జెండర్స్ వికలాంగులు, ఇతర శాఖ అధికారులకు అగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఓటరు అవగాహన వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు సీనియర్ సిటిజన్లను సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్‌యే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. స్వీప్ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే ఓటరు నమోదుపై విస్తృతంగా ప్రచారం కల్పించామన్నారు. వేసవి దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో వసతలు కల్పిస్తున్నామని, తాగునీటితో పాటు టెంట్లను వేస్తామన్నారు. సీనియర్ సిటిజన్లకు ఎలాంటి క్యూ లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఓటరుగా నమోదైన ప్రతీఒక్కరు తమ హక్కును వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఎస్పీ జీవన్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

లక్ష్మణచాంద, ఏప్రిల్ 16 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన 'ఆరోగ్య మహిళా' కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో రాజేందర్ మంగళవారం పర్యవేక్షించారు. మహిళలకు ప్రతి మంగళ వారం టెస్టులు నిర్వహించి, ఆరోగ్య సలహాలు ఇవ్వటంతో పాటు చికిత్సలు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ పీవో శ్రీనివాస్, వైద్యాధికారి ప్రత్యూష, తదితరులు ఉన్నారు.



పర్యవేక్షణ చేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రాజేందర్

రోడ్డు భద్రతపై ఆర్టీసీ అవగాహన

దిలావర్‌పూర్, ఏప్రిల్ 16 : నిర్మల్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో మంగళ వారం మండలంలోని సిర్గాపూర్ బస్టాండ్‌లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ప్రతినిధి ఎల్. నర్సయ్య మాట్లా డుతూ... బైక్‌పై వెళ్తున్న వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి బైక్ నడపాలని సూచించారు. మీపై మీ కుటుంబం ఆధారపడి ఉందని, కార్లు నడిపేవారు తప్పనిసరిగా సీటుబెల్ట్ ధరించాలన్నారు. రహదారుల సూచ నలు పాటించాలన్నారు. సేఫ్టీ వార్డెన్ రాజన్న మాట్లాడుతూ... ప్రతి ఆర్టీసీ బస్సులో జీపీఎస్ సిస్టం అమలులో ఉందన్నారు. ప్రతి ఒక్కరై మీ ఆండ్రా యిడ్ ఫోన్‌లో ఆర్టీసీ గమ్యం యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ, రాజధాని, లహరి ఏ బస్సు అయినా కానీ మీరు ఎక్క వలసిన బస్సు ఎప్పుడు వస్తుంది. ఎక్కడి వరకు వచ్చింది గమ్యం యాప్ ద్వారా తెలుసుకోవచ్చని, మీ కుటుంబ సభ్యులను మీరు బస్సు ఎక్కిస్తే గమ్యం చేరుకున్నారా లేదా ఈ యాప్ ద్వారా తెలుసు కోవచ్చిన సూచిచారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



సిర్గాపూర్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

జాతరకు ముస్తాబైన జగదాంబ దేవి ఆలయం



పెంబి, ఏప్రిల్ 16 : పెంబి మండలంలోని తాటిగూడ గ్రామంలో జగ దాంబ దేవీప్రకాష్ మహారాజ్ ఆలయ వార్షికోత్సవం బుధవారం నుంచి రెండు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతి సంవ త్సరం శ్రీరామనవమికి జరుగుతుందని ప్రకాష్ మహారాజ్ తెలిపారు. ప్రజ లు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఆలయాన్ని ఆల య కమిటీ సభ్యులు విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. వచ్చే భక్తు లకు ఎలాంటి ఆటంకం కలగవద్దని అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని బుధ వారం నవమి జాతర, గురువారం దశమి జాతర ఉంటుందని తెలిపారు.
























ప్రారంభిస్తున్న సీఐ గండికోట మొగిలి

ఉట్నూర్‌లో పొరకబండ్ల శోభాయాత్ర

ఉట్నూర్, ఏప్రిల్ 16: శ్రీసీతారాముల కల్యాణం పురస్కరించుకుని పెళ్లి పందిరి కోసం కావాల్సిన పొరకబండ్ల శోభాయాత్ర నిర్వహించారు. మండల కేంద్రంలోని వినాయకచౌక్‌లో మంగళవారం 108 తురకబండ్లను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సిద్ధం చేశారు. ఉట్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గండికోట మొగిలి, హిందూ ఉత్సవ సమితి నాయకులు పొరకబండ్లకు పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు మంగళహారుతలతో ముందు నడవగా పొరకబండ్లు వారివెంట నడిచాయి. వినాయక్ చౌక్ నుంచి ప్రధాన రహదారి గుండా అంబేద్కర్ చౌక్ మీదుగా పాత ఉట్నూర్‌లోని కాకతీయుల నాటి శ్రీసీతారాముల ఆలయం వరకు పొరకబండ్ల శోభయాత్ర కొసాగింది. ఈ కార్యక్రమంలో పూజారి సంతోష్‌దుబేతో పాటు హిందూ ఉత్సవ సమితి నాయకులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● యువత గంజాయి, కలప స్మగ్లింగ్‌కు పాల్పడవద్దు ● త్వరలో వాయిపేట్ రోడ్డు, త్రీఫేజ్ విద్యుత్ లైన్‌కు అనుమతులు : ఆదిలాబాద్ ఎస్పీ



మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న ఎస్పీ గౌస్‌ఆలం



ఎస్పీ, డీఎఫ్‌వోలకు స్వాగతం పలుకుతున్న గిరిజనులు

సిరికొండ రూరల్, ఏప్రిల్ 16: యువత మత్తు పదార్థాలకు బానిసగాకుండా చెడు అలవాట్లకు దూరంగ ఉండాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్ ఆలం పిలుపునిచ్చారు. మంగళవారం సిరికొండ మండలంలోని వాయిపేట్ గ్రామపంచాయతీ పరిధిలోని చిమ్మన్‌గుడి గ్రామంలో పోలీసులు ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళన సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్‌పాటిల్‌తో కలిసి పాల్గొని వారు మాట్లాడారు. అంతకుముందు ఆత్మీయ సమ్మేళనానికి విచ్చేసిన ఎస్పీ, డీఎఫ్వోకి గ్రామస్థులు డప్పుచప్పుళ్లతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి, కల్తీ కల్లు లాంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారి యువత తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, దాని వల్ల తల్లిదండ్రులు మానసికక్షోభకు గురవుతున్నారని అన్నారు. మత్తు పదార్థాలను తీసుకోవడం వల్లనే ఆత్మహత్యలకు, హత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి, గుడుంబా, కల్తీకల్లును విక్రయించినా, రవాణా చేస్తున్నా.. వెంటనే పోలీసులు లేదా డయల్ 100కు గానీ, నేరుగా తమకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే గిరిజన నిరుద్యోగ యువకులు నక్సల్స్ ఉద్యమానికి ఆకర్షితులై, అందులో చేరి వారి బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. నిరుద్యోగ యువతకు పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమాలు కూడా చేపడుతున్నామని అన్నారు. అనంతరం రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో విడుదల చేసిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించి, గంజాయి, కల్తీ కల్లు వినియోగం వల్ల జరిగే అనర్థాలపై ప్రజలకు ఎస్పీ వివరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకుని మంచి నాయకున్ని ఎన్నుకోవాలని ఆయన సూచించారు. జిల్లా అటవీశాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ మాట్లాడుతూ.. గిరిజనులు ఎన్నో ఏళ్లుగా గ్రామాల్లో కనీస మౌలికవసతులు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, అందుకోసం సిరికొండ నుంచి ఫకీర్‌నాయక్‌తండా వరకు తారు రోడ్డుతో పాటు త్రీఫేజ్ విద్యుత్ లైన్ కోసం అనుమతుల కోసం ఉన్నతాధికారులకు పంపించడం జరిగిందని, వాటి అనుమతులు రాగానే పనులు ప్రారంభించేలా సంబంధిత అధికారులకు తెలియపరుస్తామని ఆయన తెలిపారు. అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంరక్షణ కోసం అడవులను నరకకుండా గిరిజనులు అటవీఅధికారులకు సహకరించాలని కోరారు. అటవీప్రాంతంలో ఎవరైనా అక్రమంగా చెట్లను నరికినా, కలప స్మగ్లింగ్‌కు పాల్పడినా అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేందర్, సీఐ భీమేష్, ఎస్సైలు నవీన్ గౌడ్, శ్రీకాంత్, డీఆర్వోలు గిరయ్య, పోలీసు సిబ్బంది, ఫారెస్ట్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

● నేరస్థులకు శిక్ష పడేలా పరిశోధన నిర్వర్తించాలి

ఆదిలాబాద్ అర్బన్: నేరస్తులకు ఖచ్చితంగా శిక్షలు పడే విధంగా పరిశోధన నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఐపీఎస్ తెలిపారు. మాదక ద్రావ్యాల నిరోధక చట్టంతో పరిశోధనలు, కోర్టులో చార్జీషీటు దాఖలు చేసే విధానం నేరస్థులను పట్టుకునే క్రమంలో చేసే పద్ధతులపై, మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకునేటప్పుడు తీసుకోవాల్సిన పద్ధతులు అంశాలపై ఇన్వెస్టిగేషన్ అధికారులకు శిక్షణ కార్యక్రమంలో అవగాహనను కల్పించారు. జిల్లాలో ఎటువంటి మత్తు పదార్థాలులేకుండా సమిష్టిగా కృషి చేసి నేరస్థులకు శిక్షలు పడే విధంగా పరిశోధన నిర్వహించాలని సూచించారు. అదే విధంగా ప్రజలు మత్తు పదార్థాలను సేవించడం వల్ల నేరాలు చేసే ఆస్కారం ఉందని, మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాల పై వివరించాలని సూచించారు. గంజాయి, కల్తీ కల్లు తదితర మత్తు పదార్థాలను తాగడం వల్ల జీవితాలు నాశనం అవుతాయని విషయాన్ని ప్పరజలకు వివరించాలన్నారు. అదేవిధంగా పదేపదే నేరం చేసే నేరస్థుల పై ప్రత్యేక కార్యాచరణ ద్వారా శిక్షలు కఠినంగా విధించే విధంగా చార్జీషీటు దాఖలు చేయాలని సూచించారు. టీఎస్ న్యాబ్ ద్వారా విచ్చేసిన నూతన పోస్టర్లను జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అందుబాటులో ఉంచి చైతన్యపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ కె.సురేందర్‌రెడ్డి,డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించండి

ఉట్నూర్, ఏప్రిల్ 16: ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన భోజనం అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. మంగళవారం ఉమ్మడి జిల్లాలోని కెరిమెరి మండలంలోని మోదీ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్‌లో అవకతవకలను గుర్తించి సంబంధిత ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా విద్యార్థులు ఆరుబయట నీరు తాగడంతో జైనూర్ ఏటీడబ్ల్యు అర్జున్, ప్రధానోపాధ్యాయుడు సాయితో పాటు వార్డెన్‌కు షోకాజు మెమోలు జారీ చేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజు మెను ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

తలమడుగు, ఏప్రిల్ 16: గతఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ సాధ్యంకాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని బడుగు బలహీన వర్గాల అభివృద్ధి బీజేపీ పార్టీతోనే సాధ్యమని ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి జి.నగేష్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని దేవాపూర్, బరంపూర్, నందిగామ, తదితర గ్రామాల్లో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించి అనంతరం దేవాపూర్‌లో బూత్ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడారు. ఇందులో బీజేపీ సీనియర్ నాయకులు చంద్రకాంత్, వెంకట్‌స్వామి, ప్రభాకర్, కిరణ్‌స్వామి, పెద్దసఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

● డీఎల్‌పీవో ఫణిందర్

నేరడిగొండ, ఏప్రిల్ 16: వేసవి కాలంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై, ప్రజా ప్రతినిధులపై ఎంతైనా ఉందని డీఎల్‌పీవో ఫణిందర్ అన్నారు. మంగళవారం మండలంలోని వడూర్ గ్రామంలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. దీనిలో ఆగంగా ముందుగా గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి సంబంధిత రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించిన ఆయన నీటి బోర్ల వద్ద తాగునీటిని తీసుకెళ్తున్న ప్రజలతో మాట్లాడారు. బోరు నీటిని తీసుకెళ్లేటప్పుడు అందరు ఒకేసారి వచ్చి నీటిని తీసుకెళ్లాలని నీరు వృథా చేయకూడదని సూచించారు. ఆయన వెంట ఎంపీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి, తదితరులున్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి : సీఐ రమేష్

బోథ్, ఏప్రిల్ 16: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని బోథ్ సీఐ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మరలపెల్లి, దన్నూర్, బోథ్ గ్రామాలలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణనికి ఎవరైనా భంగం కలిగించే విధంగా ఉంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలు భయభ్రాంతులకు గురి చేస్తే ప్రజలు వారి సమాచారాన్ని ఇవ్వాలని తగు చర్యలు తీసుకుంటామన్నారు. ర్యాలీలో ప్రత్యేక పోలీసు బలగాలు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ముక్రా(కె) గ్రామస్థుల స్వాగతం

ఇచ్చోడ, ఏప్రిల్ 16: బీఆర్ఎస్ కార్యానిర్వహక అధ్యక్షుడు మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు మంగళవారం ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నేరడిగొండ మండలం రోల్‌మామడ టోల్‌గేట్ వద్ద కేటీఆర్‌కు మండలంలోని ముక్రా(కె) గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఇందులో మాజీ సర్పంచి గాడ్గె మీనాక్షి, ఎంపీటీసీ సుభాష్, ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, తదితరులు ఉన్నారు.

నేరడిగొండ: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మంగళవారం రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌తో పాటు ఉమ్మడి జిల్లా నాయకులు ఘన స్వాగతం పలికారు. పార్లమెంట్ ఎన్నికల బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఉండగా అటువైపు వెళ్తున్న కేటీఆర్‌కు భారీ గజామాలతో సన్మానించారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ బీఆర్ఎస్ నాయకుడు జాన్సన్‌నాయక్, బోథ్ జడ్పీటీసీ సంధ్యరాణి, బోథ్, నేరడిగొండ ఎంపీపీలు తుల శ్రీనివాస్, రాథోడ్‌సజన్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వారసంతలో కాంగ్రెస్ ప్రచారం

బోథ్, ఏప్రిల్ 16: బోథ్ మండల కేంద్రంలో మంగళవారం వారంతపు సంతలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని పలువురు కోరారు. కాంగ్రెస్ పార్టీతోనే సరైన న్యాయం జరుగుతుందని వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పి.చంటి, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, జి.గంగాధర్, నాజర్, అహ్మద్, షేక్ అబుదల్, అంజయ్య, రహీముద్దీన్, సురేందర్, పడగల భోజన కురుమే గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లాలో బీఆర్ఎస్‌కు బిగ్‌షాక్

● కాంగ్రెస్‌లోకి మాజీ కేంద్రమంత్రివర్యులు డా.ఎస్ వేణుగోపాలచారి

భైంసా, ఏప్రిల్ 16 : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్‌కు బిగ్‌షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, కేంద్ర, రాష్ట్ర మాజీ మంత్రివర్యులు డా.ఎస్ .వేణుగోపాలచారి హస్తం గూటికి చేరారు. మంగళవారం హైదరాబాద్‌లో చారి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు నేతృత్వంలో డా.ఎస్.వేణుగోపాలచారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చారికి పార్టీ కండువా వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. డా.ఎస్. వేణుగోపాలచారి నిర్మల్, ముథోల్ నియోజక వర్గాల పరిధి నుంచి ఎమ్మెల్యేగా, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యునిగా గెలుపొంది కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ మంత్రివర్గ బాధ్యతలు చేపట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో న్యూఢిల్లీలో రాష్ట్ర అధికార ప్రతినిధిగా, ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మెన్‌గా పదవులను అలంకరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మంచి పట్టు కలిగిన డా.ఎస్.వేణుగోపాలచారి ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానపరిధిలో రాజకీయంగా అపర చాణక్యుడిగా పేరుగడించారు. అన్ని ప్రాంతాల్లో అనుచరగణం, అభిమానులు కలిగి ఉన్న చారికి ముథోల్, నిర్మల్,ఖానాపూర్ నియోజక వర్గాల పరిధిలో పూర్తి స్థాయి పట్టు ఉంది. ఇలాంటి నాయకుడు లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంల బీఆర్ఎస్‌ను వీడటం ఆ పార్టీకి తీరని నష్టం కలిగించే అంశం. చారి చేరికతో కాంగ్రెస్‌కు మరింత పట్టు పెరిగే పరిస్థితులు నెలకొని ఉన్నాయి.

అగ్నిప్రమాద నివారణ చర్యలపై అవగాహన పెంపొందించుకోవాలి

● భైంసా అగ్నిమాపక శాఖ అధికారి సింగన్న



భైంసాలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది


భైంసా,ఏప్రిల్ 16: అన్ని వర్గాల ప్రజలు అగ్నిప్రమాద నివారణ చర్యలపై పూర్తిస్థాయి అవగాహన పెంపొందించుకోవాలని భైంసా ఫైర్ ఆఫీసర్ సింగన్న పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం పట్టణ పరిధిలోని వివిధ ఆసుపత్రులు, బస్టాండ్, అపార్ట్‌మెంట్ ప్రాంతాలలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు అన్ని వేళల జాగ్రత్త చర్యలు పాటిస్తూ అప్రమత్తతతో వ్యవహరిస్తే అగ్ని ప్రమాదాలకు అవకాశముండదన్నారు అగ్నిమాపక శాఖ నిబంధనలకు అనుగుణంగా ప్రమాదాల నివారణకు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరుగడానికి గల కారణాలు,వాటి నివారణ చర్యలు, పాటించాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై నిర్వాహణ సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ఫైర్ సిబ్బంది అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలు, పాటించాల్సిన ముందు జాగ్రత్త చర్యలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

'కాంగ్రెస్ పార్టీ వల్లనే దేశాభివృద్ధి సాధ్యమైంది'

కుభీర్, ఏప్రిల్ 16 : కాంగ్రెస్ పార్టీ ద్వారానే దేశంలో అభివృద్ధి సాధ్యం అయిందని ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. మంగవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే రైతులకు ఎలాంటి కష్టాలు లేకుండా పంటలు పండించి విక్రయించారని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం అన్నారు.. మాజీ ఎమ్మెల్యేలు నారాయణ్‌రావుపాటిల్, విఠల్‌రెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఎంపీగా ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.

వాలేగాంను సందర్శించిన ఎంపీడీవో

భైంసా రూరల్, ఏప్రిల్ 16 : మండలంలోని వాలేగాం గ్రామాన్ని మంగళవారం ప్రత్యేక అధికారి ఎంపీడీవో సుధాకర్ రెడ్డి సందర్శించారు.









CLASSIFIEDS

CHANGE OF NAME

I, VADLA NARASAIAH NIMMALA (OLD NAME) R/O H.NO. 8-2/1, PADMAVATHI NAGAR, KHANAPUR, NIRMAL, T.S. I HAVE CHANGED MY NAME AS NIMMALA NARSAIAH (NEW NAME) AJZ

SERVICES

★ కోర్టు కేసులతో బాధపడుతున్నారా? NOC ఇబ్బందులు ఉన్నాయా? మీ కేసులు మీరే వాదించుకోండి. మీకు న్యాయ సలహాలు ఇస్తాము. అనగా భూతగాదాలు, DVC, Divorce Maintenance, 498-A, Child custody etc.. GLS, L.B.NAGAR, HYD : 7893011777 AJH-002177

Classifieds — మీ అభిమాన ఆంధ్రజ్యోతి దినపత్రిక కల్పిస్తోంది ఒక చక్కటి అవకాశం — ప్రతి రోజూ... క్లాసిఫైడ్స్ — FOR SALE, BEAUTICIAN, COMPUTERS, MOBILE REPAIRING, ELECTRONICS, EDUCATION, AUTOMOBILES, WANTED

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-
ఆదిలాబాద్ : 99854 11291, నిర్మల్ : 80966 77672





కారు బేజారు





సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి

- అనూహ్య పరిణామాలతో ఖంగుతిన్న బీఆర్ఎస్
- కాంగ్రెస్‌లో చేరిన మాజీ కేంద్ర మంత్రి చారి
- అనుచరవర్గంతో అభిప్రాయం సేకరించిన మాజీ మంత్రి అల్లోల
- ఐదు రోజుల్లో కాంగ్రెస్‌లో చేరే విషయంపై స్పష్టతనిస్తానంటూ ప్రకటన
- ఇప్పటికే పలువురు ఎంపీపీలు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్‌లు కాంగ్రెస్‌లో చేరిక
- రోజు రోజుకు మలుపుతిరుగుతున్న నిర్మల్ రాజకీయం

నిర్మల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కారు పార్టీ బేజారవుతోంది. ఇక్కడి రాజకీయాలు రోజురోజుకు అనూహ్య మలుపులు తిరుగుతుండడంతో ఏ క్షణం ఎలాంటి పరిణామం చోటు చేసుకుంటుందోనన్న ఆసక్తి నెలకొంటోంది. గత 20 రోజుల నుంచి బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు వరుసపెట్టి కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్న సంగతి తెలిసిందే. మంగళవారం అనూహ్యంగా ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి అనూహ్యంగా బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. మొన్నటి వరకు మౌనంగా ఉన్న వేణుగోపాలచారి అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడంతో బీఆర్ఎస్ పార్టీ వర్గాలు ఆశ్చర్యానికి గురయ్యాయి. మూడుసార్లు ఎమ్మెల్యేగా, మరో మూడుసార్లు ఎంపీగా, రెండుసార్లు కేంద్రమంత్రిగా ఆయన కొనసాగారు. అలాగే మరోసారి కూడా ముథోల్ నియోజకవర్గం నుంచి ఆయన ఎమ్మెల్యేగా వ్యవహరించారు. బీఆర్ఎస్ పార్టీలో కూడా ఆయన కీలకనేతగా కొనసాగారు. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధిగా వ్యవహరించారు. కాగా ఏడాది క్రితం రాష్ట్ర ఐడీసీ చైర్మన్‌గా కూడా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియమితులయ్యారు. అలాంటి సీనియర్ నేత కాంగ్రెస్ పార్టీలో చేరడం కారు పార్టీని కలవరపెడుతోంది. ఇదిలా ఉండగా మాజీ రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి గత కొద్దిరోజుల నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ కాంగ్రెస్‌లో చేరేందుకు తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఆయన చేరికను ఇక్కడి కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డుకుంటుండడంతో జాప్యం జరుగుతోంది. దీని కారణంగా ఇంద్రకరణ్‌రెడ్డి అనుచరులు అయోమయానికి గురవుతున్నారు. ఈ పరిణామాన్ని పసిగట్టిన ఇంద్రకరణ్‌రెడ్డి తన ఆధిపత్యం చేయి దాటిపోకుండా కాపాడుకునేందుకు సీరియస్‌గా రంగంలోకి దిగారు. ఇందులో భాగంగానే మంగళవారం ఆయన తన ముఖ్యమైన నాయకులు, అనుచరులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం జరిపి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. మరో ఐదురోజుల్లో తానూ కాంగ్రెస్ పార్టీలో చేరబోతానో లేదోనన్న అంశాన్ని స్పష్టం చేస్తానంటూ అప్పటి వరకు అనుచరులంతా వేచి చూడాలని స్పష్టం చేశారు. అయితే ఇంద్రకరణ్‌రెడ్డి నాలుగైదు రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమంటున్నారు. ఈ పరిణామాలన్నీ బీఆర్ఎస్ పార్టీని కోలుకోలేకుండా చేయబోతున్నాయని అంటున్నారు. ఆ పార్టీకి సరియైన దిశానిర్దేశం కరువైందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రోజురోజుకు బీఆర్ఎస్ పార్టీ నుంచి వలసలు పెరిగిపోతుండడం, ఏ ఒక్కనేత కూడా పార్టీ మారే వారిని అడ్డుకోకపోతుండడంతో పాటు పార్టీ అధిష్టానం సైతం ఇక్కడి వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోకపోతుండడం చర్చకు తావిస్తోందంటున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలంతా గంపగుత్తగా బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నప్పటికీ ఆ పార్టీ అధిష్టానం ఈ దిశగా స్పందించకపోతుండడం భిన్నాభిప్రాయాలను రేకెత్తిస్తోంది. ఇలాంటి పరిణామాలన్నీ బీఆర్ఎస్ పార్టీలో నెలకొన్న గందరగోళానికి అద్దం పడుతున్నాయంటున్నారు.

చారి చేరిక సస్పెన్స్

కాగా అప్పటి తెలుగుదేశం పార్టీలోనూ బీఆర్ఎస్ పార్టీలోనూ కీలకంగా వ్యవహరించి రాష్ట్ర, జాతీయస్థాయిలో అనేక పదవులు చేపట్టిన వేణుగోపాలచారి అనూహ్యంగా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన అంశం చర్చనీయాంశంగా మారుతోంది. నిన్నా మొన్నటి వరకు మౌనంగా ఉన్న వేణుగోపాలచారి నేతలందరినీ సస్పెన్స్‌లో పెట్టి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా ఆయన చాప కింద నీరులా కాంగ్రెస్ పార్టీలో చేరిక వ్యవహారంపై ప్రయత్నాలు సాగించారంటున్నారు. వేణుగోపాలచారికి నిర్మల్‌తో పాటు ముథోల్ నియోజకవర్గంలో కూడా కొంత మేరకు అనుచరవర్గం ఉంది. అయితే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కొంతకాలం నుంచి ఆయన గుర్రుగా ఉన్నట్లు చెబుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్ వేణుగోపాలచారికి పెద్దగా ప్రాధాన్యతనివ్వకుండా ఇతర నేతలను ప్రోత్సహించడం అలాగే కీలక సమావేశాలకు పక్కన పెట్టడం లాంటి చర్యల కారణంగానే ఆయన పార్టీ మారాడంటున్నారు.

ఐకెరెడ్డి సమావేశంపై అంతటా చర్చ

కాగా బీఆర్ఎస్ పార్టీలో కీలకనేతగా అలాగే అప్పటి ప్రభుత్వంలో రెండుసార్లు మంత్రిగా కొనసాగిన అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు జరుపుతున్న ప్రయత్నాలు ప్రస్తుతం ఇక్కడి రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారుతున్నాయి. పార్టీ అధినేత కేసీఆర్ వైఖరి కారణంగానే ఆయన ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరేందుకు జరుపుతున్న ప్రయత్నాలను ఇక్కడి డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు వర్గం బలంగా అడ్డుకుంటోంది. శ్రీహరిరావు వర్గం అడ్డుకోవడంతోనే ఇంద్రకరణ్‌రెడ్డి ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీలో చేరలేకపోయారంటున్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోని రాష్ట్రస్థాయి నేతలతో చేరిక విషయంలో జరిపిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఇంద్రకరణ్‌రెడ్డి మంగళవారం నిర్మల్‌లో తన అనుచరులు, అభిమానులతో సమావేశం నిర్వహించి తన భవిష్యత్ కార్యాచరణ పట్ల వారి అభిప్రాయాలను తీసుకున్నారు. అయితే ఆయన అనుచరులంతా ఐకెరెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేరాలంటూ ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం. దాదాపు మూడు గంటలకు పైగా జరిగిన ఈ సమావేశంలో ఐకెరెడ్డి కీలక ప్రకటన చేశారు. ఐదురోజుల్లో తన రాజకీయ భవిష్యత్‌పై స్పష్టమైన ప్రకటన చేస్తానని ఆయన వెల్లడించారు. దీంతో పాటు తనకు వయసు పైబడ లేదని చివరి వరకు ప్రజాక్షేత్రంలోనే ఉంటానంటూ ప్రకటించి పరోక్ష సంకేతాలను ఇచ్చారు. బహుశా నాలుగైదు రోజుల్లో ఆయన కాంగ్రెస్‌లో చేరే అవకాశాలున్నాయంటున్నారు.

నేడు హిందూవాహిని ఆధ్వర్యంలో శోభాయాత్ర

- శ్రీరామ నవమి వేడుకలకు ఆలయాల ముస్తాబు
- భారీ బందోబస్తు ఏర్పాట్లు చేపట్టిన పోలీసుశాఖ



ముస్తాబు చేసిన శ్రీరామ ప్రతిమ

భైంసా,ఏప్రిల్ 16 : శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని బుధవారం భైంసాలో హిందూవాహిని భారీ శోభాయాత్రకు ఏర్పాట్లు చేసింది. స్థానిక గోశాల నుంచి శోభాయాత్ర ప్రారంభమై భట్టిగల్లీ, గణేష్‌నగర్, పద్మవతీకాలనీ, పాత పోస్టాఫీస్, బస్టాండ్ రోడ్డు, నిర్మల్ క్రాస్ రోడ్‌ల మీదుగా శోభాయాత్ర పిప్రి కాలనీలోని రామ్‌లీల మైదానం వరకు కొనసాగనుంది. శ్రీరాముని భారీ ప్రతిమతో శోభాయాత్ర నిర్వహించేందుకు గాను హిందూవాహిని శ్రేణులు ప్రణాళికబద్ధమైన ఏర్పాట్లు చేపట్టాయి. భైంసా డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 2 వేలకు పైగా మంది యువకులు శోభాయాత్రలో పాల్గొననున్నట్లుగా హిందూవాహిని ప్రతినిధులు వెల్లడించారు.

భారీ బందోబస్తు

పట్టణంలో హిందూ వాహిని ఆధ్వర్యంలో బుధవారం జరిగే శోభాయాత్రకు పోలీసుశాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేపట్టింది. మంగళవారం ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ శోభయాత్ర సందర్భంగా ఏర్పాటు చేయనున్న భద్రతాచర్యలపై సబ్‌డివిజన్ పోలీసు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలని భైంసా టౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్ఐలను ఆదేశించారు.

పోలీసుల కవాతు

పట్టణ పరిధిలో జరుగనున్న శోభాయాత్రను పురస్కరించుకొని మంగళవారం పోలీసు శాఖ కవాతు చేపట్టింది. ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, టౌన్ సీఐ రాజారెడ్డిల నేతృత్వంలో బందోబస్తు కోసం తరలివచ్చిన ప్రత్యేక పోలీసు బలగాలు, ఏఆర్ పోలీసులు, సివిల్ పోలీసులు కవాతులో పాల్గొన్నారు. శోభాయాత్ర కొనసాగే మార్గంలో పోలీసులు కవాతు చేపట్టారు.

ఆలయాల ముస్తాబు

పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం, బాగుబాయి గుట్ట సాయిబాబా మందిరాలు బుధవారం జరిగే శ్రీరామనవమి వేడుకల కోసం ముస్తాబయ్యాయి. ప్రతీ ఏటా రెండు ఆలయాల్లోనూ శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.



కవాతులో పాల్గొన్న ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ తదితర పోలీసు అధికారులు

శోభాయాత్రకు పటిష్ఠ బందోబస్తు

ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 16 : జిల్లాకేంద్రంతో పాటు భైంసా పట్టణంలో శ్రీరామనవమి సందర్భంగా బుధవారం జరిగే శోభాయాత్రకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... పోలీస్ అధికారులు, సిబ్బంది తమకు విధించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. నిర్లక్ష్యం ప్రదర్శించరా దన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని, సమయస్ఫూర్తితో వ్యవహరించాలని ఆదేశించారు. శోభాయాత్రకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, సీఐలు, ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్



కుంటాల మండలంలో తాగునీటి సమస్య గురించి ప్రజలను అడిగి తెలుసుకుంటున్న డీపీవో

కుంటాల, ఏప్రిల్, 16: వేసవికాలం దృష్ట్యా మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. అంతేగాకుండా నీటిఎద్దడి ఉన్నచోట ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. మంగళవారం కుంటాల మండలంలోని, ఓలా, సూర్యాపూర్, మెదన్‌పూర్, అంబుగాం గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు తాగునీటి సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. అధికారులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ తాగునీటి సమస్యను రాకుండా చూడాలన్నారు. అంతేగాకుండా పలు గ్రామాల్లో గ్రామపంచాయతీల్లో రికార్డులను పరిశీలించిన ఆయన అనంతరం సూర్యాపూర్, అంబుగాం గ్రామాలల్లో పల్లె ప్రకృతివనం, హరితహారం నర్సరీలను పరిశీలించారు. వచ్చే వర్షాకాలంలో గ్రామాలలో హరితహారం పథకంలో భాగంగా నాటేందుకు మొక్కల పెంపకాన్ని పకడ్బందీగా చేపట్టాలని సరైన సమయంలో మొక్కలకు నీరందిస్తూ ఎప్పటికప్పుడు కలుపు మొక్కలను తొలగించాలని సూచించారు. ఈయన వెంట ఎంపీడీవో రహీం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీలు, పలు శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రవి

కుంటాల, ఏప్రిల్, 16 : కుంటాల మండలంలోని కల్లూర్- కుంటాల రహదారిపై అందకూర్- కల్లూర్ గ్రామాల మధ్యన సోమ వారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కుభీర్ మండల కేంద్రానికి చెందిన బొప్పరవి (38) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు కుంటాల ఎస్సై రజనీకాంత్ తెలిపారు. రవి సోమవారం రాత్రి కుంటాల నుండి ద్విచక్ర వాహనంపై భైంసా వెళుతున్న సమయంలో కల్లూర్ అందకూర్ గ్రామాల మధ్యలో బైక్ అదుపుతప్పి కల్వర్టు కింద పడి చనిపోయాడని పేర్కొన్నారు. మృతుడు భైంసాలో జనరల్ స్టోర్ షాపు నడుపు కుంటూ జీవనం గడుపుకునేవాడని అతనికి ఇద్దరు కుమారులున్నారని ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడి బలవన్మరణం



తానూర్, ఏప్రిల్ 16 : మండలంలోని బోసి గ్రామానికి చెందిన బాలేరావు దినేష్ (23) అనే యువకుడు ఉరివేసుకొని మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వివరాల ప్రకారం.... దినేష్ కూలీ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఇటీవల తన తండ్రి దిగంబర్‌కు అనారోగ్యం బాగా లేక పోవడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకొని మంగళవారం ఉదయం బోసి గ్రామంలోని తన ఇంటికి చేరుకున్నాడు. ఇంటికి వచ్చి చూసే సరికి దినేష్ మృతి చెంది ఉన్నాడని, ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు తెలిపారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలేరావు దినేష్ మృతదేహం

సీఎంఆర్ సరఫరాను పూర్తి చేయాలి : కలెక్టర్



సమీక్ష జరుపుతున్న కలెక్టర్



హాజరైన అధికారులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 16 : కస్టమ్స్ మిల్లింగ్ రైస్ సరఫరా వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం రైస్‌మిల్లర్లు, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మిల్లింగ్ ప్రక్రియ నిరంతరం సాగాలన్నారు. ఇప్పటివరకు ప్రారంభించిన మిల్లర్లపై కఠినచర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. మిల్లుల వారీగా మిల్లింగ్, ధాన్యం నిల్వలపై నివేదికలు అందజేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఎస్‌వో నందిత, డీఎం శ్రీకళ, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు సమావేశానికి హాజరయ్యారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

పట్టణ పరిశుభ్రతకు అధికారులు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. మంగళవారం ఈద్గామ్, శివాజీచౌక్ ప్రాంతాల్లో మురికి కాలువలను పరిశీలించారు. పలు సూచనలు చేస్తూ తడి, పొడి చెత్త వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలన్నారు. ప్రధాన కూడళ్లను, రహదారులు, మురికి కాలువలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇష్టారాజ్యంగా చెత్తరోడ్లపై వేసేవారికి అపరాధ రుసుము వసూలు చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. వందశాతం ఆస్తి పన్ను వసూలు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ రాజు, సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.



పరిశీలిస్తున్న కలెక్టర్

జిల్లావ్యాప్తంగా 8 జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం

మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి

నిర్మల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ఎనిమిది జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం అదనపు కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని కుబీర్, కల్లూర్, కుంటాల, పెంచికల్‌పాడ్, భైంసా, సారంగాపూర్, తానూర్, గుండంపల్లిలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా జొన్న కొనుగోలు కేంద్రాలను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. క్వింటాల్ జొన్నకు రూ.3,180 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రైతులు తాము పండించిన జొన్న పంటను దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న జొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే జొన్న పంటలో తేమ శాతం 14 కంటే తక్కువగా ఉండాలని, చెత్తా చెదారం లేకుండా శుభ్రపరచిన జొన్నలను కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలన్నారు.

50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యంతో పోలీసులు

ఖానాపూర్, ఏప్రిల్ 16 : అక్రమంగా తరలిస్తున్న 50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే ఎస్సై లింబాద్రి తెలిపిన కథనం ప్రకారం... మంగళవారం ఉదయం నాలుగు గంటల సమ యంలో మహేంద్ర మినీ డీసీఎం వాహనం అనుమానా స్పదంగా కనిపించడంతో బ్లూ కోర్ట్ పెట్రోకార్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది కొమరం భీమ్ చౌరస్తా వద్ద సదరు వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ వాహన ంలో కడెం మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన సంగ వెంక టేష్, గొల్ల జలపతి అనే ఇద్దరు వ్యక్తులు ఎటువంటి అను మతి పత్రాలు లేకుండా 50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించినట్లు ఎస్సై లింబాద్రి పేర్కొన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహణపై మంగళవారం ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో వీవింగ్, స్టాటిస్టికల్ సర్వేలైన్ టీమ్‌లకు శిక్షణ నిర్వహించారు. మాస్టర్ ట్రైనీ మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాలు, ప్రలోభ పెట్టే వాగ్దానాలు చట్టవిరుద్ధమని వాటిని నిరోధించేలా చూడాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి పోస్టులు పెట్టకుండా చూడాలని, నగదు తరలింపు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రాత్రి పది తరువాత ప్రచారం నిర్వహించకుండా చూడాలన్నారు. సి విజిల్ యాప్, టోల్ ఫ్రీ నంబర్ 1950 తదితర అంశాలపై ఈడీఎం నదీం అవగాహన కల్పించారు. డీఎల్ఎంటీలు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

నిర్మల్ కల్చకరల్, ఏప్రిల్ 16 : దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ మంగళవారం ఎన్నికల నోడల్ అధికారి డీఈవో రవీందర్ రెడ్డికి పీఆర్టీయూ వినతిపత్రం అందజేసింది. నాయకులు వై. సాయన్న రవిరాజు, పాల్గొన్నారు.

పాక్‌పట్లలో బీజేపీ లాభార్తి సంపర్క్

- కేంద్ర పథకాలపై ప్రచారం



ప్రజలతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 16 : సోన్ మండలం పాక్‌పట్ల గ్రామంలో పలు బూత్‌లలో మంగళవారం లాభార్తి సంపర్క్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. జిల్లా అధ్యక్షుడు కే. అంజుకుమార్ రెడ్డి పాల్గొన్నారు. పదేళ్లలో ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాల లబ్ధి వారికి వివరించారు. రాబోయే ఐదేళ్లలో చేపట్టబోయే కార్యక్రమాలపై తెలియజేశారు. నాయకులు హరీష్‌రెడ్డి, మార గంగారెడ్డి, అశోక్, గోవర్ధన్, ముత్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కార్యకర్తల ప్రచారం

దిలావర్‌పూర్, ఏప్రిల్ 16 : బూత్ విజయ్ సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బీజేపీ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్నారు. దిలావర్‌పూర్‌లోని 287వ బూత్‌లో ఇంటింటికి తిరిగి మోదీ గ్యారంటీ కరపత్రాన్ని ఇచ్చి డోర్ స్టిక్కర్ వేస్తూ ప్రచా రం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి మోదీకి మద్దతు నిలవాల్సిందిగా ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు పీసరి శైలేశ్వర్, మండల ప్రధాన కార్యదర్శి కోడె ముత్యం, అశోక్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి గోపు రాకేష్, బూత్‌సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.